# నాకీ పెళ్లి ఇష్టమే

-కాకాని కమల

ఎర్రని ఎండలో నడుస్తూ ఇంటికి వచ్చాడు నారాయణ. గొడుగు వేసుకున్న ఆ వృద్ధుడి శరీరం మీంచి చెమటలు జారుతున్నాయి. ఎండ వేడికి ముఖం ఎర్రగా అయ్యింది.

వసారా అంతా పెంకులు చెదిరి ఎండ పడుతూంది.

నారాయణ గొడుగు మడిచి పక్కకి పెట్టి మండువాలోకి వచ్చాడు.

గేటు తెరచిన శబ్దానికి వంటగదిలోంచే తొంగిచూసిన రవణమ్మ పెద్ద గ్లాసుతో కుండలో నీళ్లు తెచ్చి మగనికి అందించింది. తెల్లబడిన జుత్తుని వేలుముడి వేసుకుంది.

నీలం రంగు నేత చీరతో ముఖం అద్దుకుంది. అప్పుడే వంటపని అయ్యింది.

నుదుట పెట్టుకున్న కుంకుమ ముక్కు మీదికి జారింది. గోడకున్న అద్దంలో ముఖం చూసుకుంటూ కుంకుమ చెదరకుండా కొంగుతో ముఖం అద్దుకుంది.

నీళ్ళు తాగి గ్లాసు కింద పెడుతున్న భర్తతో- "ఏం ఇవ్వాళ కూడా వాళ్లు దొరకలేదా?" అంది భర్త ముఖంలో ఉత్సాహం లేకపోవడం చూసి.

"ఉన్నారు. కానీ పని జరగలేదు" అన్నాడు.

"ఏం? మన ఉష అందంగా లేదంటనా?"

"ఆ మాట ఎలా అంటారు, ముద్దబంతి పువ్వు లాంటి పిల్లని పట్టుకుని. కట్నం కావాలిట. రెండు లక్షలకు తక్కువ అయ్యే మాట అయితే కుదరదు అని నిక్కచ్చిగా చెప్పారు. రెండు వేలు ఇవ్వాలంటేనే మనకి కష్టంగా ఉంది" అన్నాడు నారాయణ.

భుజం మీది తువ్వాలు తీసి బల్లమీద పెట్టి ఒక కాలు నేలమీద ఆన్చి, ఇంకో కాలుని కుర్చీలోనే పెట్టుకున్నాడు.

రమణమ్మ మూతి విరిచింది.

"కందకి లేని దురద కత్తిపీటకని, నీ అల్లుడు మనతో తెగతెంపులు చేసుకుని రెండో పెళ్లాంతో పూలరంగడిలా తిరుగుతున్నాడు. పెళ్లికెదిగిన కూతురుందన్న ఆలోచన వాడికి లేదు కావచ్చు" అంది.

"అతగాడికున్నా ఆ రెండో పెళ్లాం పడనిస్తుందా? అయినా ఇదంతా మన దురదృష్టం. ఉష జాతకం. మన అమ్మాయి బతికుంటే ఇంకోలా వుండేది విధి" అన్నాడు నారాయణ.

నారాయణ, రవణమ్మలకి ముగ్గురు కూతుళ్లు. కొడుకులు లేరు. ముగ్గురు కూతుళ్లకి పెళ్లిళ్లు అయ్యాయి. అయితే పెద్దకూతురు మరణించింది. అప్పటికి ఉష వయసు 8 సంవత్సరాలు. అల్లుడు సత్యనారాయణ మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. అప్పట్నుంచి ఉషకి సవతితల్లి కష్టాల ఆరళ్లు మొదలయ్యాయి. తండ్రి కూడా పట్టించుకునేవాడు కాదు. ఒకరోజు ఉష పారిపోయి తాతయ్య, అమ్మమ్మల దగ్గరికి వచ్చేసింది. అప్పట్నుంచి వాళ్ల దగ్గరే ఉంటోంది. సవతితల్లి ఉషని కావాలని దూరం చేసింది. ఇప్పుడు ఉషకి పెళ్లి ఈడు వచ్చింది. కానీ ఒక్క సంబంధం కుదరటం లేదు. పిల్ల చక్కని చుక్క. కాస్త రంగు తక్కువయినా మళ్లీ మళ్లీ చూడాలనిపించే కను ముక్కు తీరుతో నల్లని బారు జడతో అందంగా ఉంటుంది. అందరికీ పిల్ల నచ్చుతోంది. కానీ నారాయణ కట్నకానుకలు భారీగా ఇవ్వలేడు. పాతిక వేలకి మించి ఖర్చు చెయ్యలేడు. అదీ ఏదో కాస్త భూమి అమ్మితేనే. ఉన్న రెండెకరాల పొలం, పెంకుటిల్లు ముగ్గురు కూతుళ్లకి సమాన వాటా. ఉష కోసం, తల్లి వాటా ఖర్చు చెయ్యగలడు. అంతకు మించి ఖర్చు చేస్తే, మిగతా ఇద్దరు కూతుళ్లు ఊరుకున్నా అల్లుళ్లు ఊరుకుంటారా? ఉషకి తండ్రి సాయం లేదు. కట్నం లేకుండా పెళ్లి చేసుకునే నాథుడు కనిపించడం లేదు. ఇప్పుడా ఉషకి 24 వస్తున్నాయి. ప్రైవేటుగా డిగ్రీ చదివింది.

కిర్రు... రు...

గేటు చప్పుడయ్యింది.




ఆ వస్తున్నది శంకరయ్యగారు. పెళ్లిళ్ల పేరయ్య.

ఆయనకి ఎదురెళ్లి– "ఏమండీ. ఏదన్నా శుభవార్త ఇప్పుడయినా చెప్తారా?"

"అమ్మా మీరు అంగీకరిస్తే శుభవార్తే తెచ్చాను" అన్నాడు.

"కట్నాలు, కానుకలు ఏ స్థాయి. ముందు అది చెప్పండి" అన్నాడు నారాయణ. అన్ని సంబంధాలు కట్నం దగ్గరే బెడిసిపోతున్నాయి.

శంకరయ్య భుజం మీది తువ్వాలుతో ముఖం చెమట అద్దుకున్నాడు.

"అమ్మాయ్ ఉషా! చల్లని నీళ్లు తీసుకురా. శంకరయ్య గారు వచ్చారు" అంది రవణమ్మ గోడ వారగా నేలమీద చతికిలపడుతూ.

ఉష పెద్ద చెంబునిండా చల్లని నీళ్లు తెచ్చి బల్లమీద పెట్టి, గ్లాసు కూడా పెట్టింది.

"అమ్మా రవణమ్మ గారూ! భగవంతుడు ఒకటి లేకుండా చేసినా ఇంకోటి ఇస్తాడంటారు. మీ మనవరాలికి మంచి కళ గల రూపం ఇచ్చాడు ఆ భగవంతుడు. ఒక మంచి సంబంధం వచ్చింది. ఆ తరువాత మీ ఇష్టం." చెంబు ఎత్తి మెడ వెనక్కి పెట్టి నోరు తెరిచి నీళ్లు తాగాడు.

ఉష లోపలికి వచ్చేసింది.

అయినా వుండువాలో మాటలు వినిపిస్తున్నాయి. "కట్నం లేకుండా మంచి సంబంధమా?" నారాయణ నవ్వబోయాడు. కొరబోయి దగ్గు వచ్చింది. గొంతు సవరించుకున్నాడు.

"అయ్యా! విషయం సూటిగా చెప్పేస్తాను. పక్క ఊళ్లో ఒక ఫారెస్ట్ ఆఫీసరు గారు బదిలీ అయి వచ్చారు. ఆయనకి భార్య పోయింది. ఇద్దరు పిల్లలు. పెద్ద పిల్లకి మూడు సంవత్సరాలు. అబ్బాయికి ఒక సంవత్సరం. భార్య ఏదో వాతపు రోగం వచ్చి పురిట్లోనే పోయిందిట. ప్రస్తుతం నాయనమ్మ చూస్తోంది. కానీ ఆవిడకి ఆరోగ్యం బాగుండదట. పిల్లల్ని బాగా చూసుకునే అమ్మాయి అయితే చాలు. కట్నం అక్కర్లేదు అన్నాడు. అమ్మాయి అందంగా ఉండాలన్నాడు. ఆయన తల్లి వాళ్లతోనే ఉంటుందిట. మీ ఇష్టం."

"సరిసరి. రెండో పెళ్లివాడా? పైగా ఇద్దరు పిల్లలా?"

"అయితే ఏం? వయసు చిన్నదే. అతడి వయసు ఇరవై ఐదు. మీ అమ్మాయి కంటే ఒక ఏడాది పెద్ద. మీ ఉషకి పెళ్లి కాలేదు గానీ అయివుంటే ఇద్దరు పిల్లలు ఉండేవారు. ఆ అబ్బాయి చాలా చక్కగా ఉన్నాడు. ప్రభుత్వ ఉద్యోగం. మీరు ఇష్టపడితే ఈ మాఘమాసంలోనే పెళ్లి జరిగిపోతుంది" అంటూ బ్యాగులోంచి పెళ్లికొడుకు ఫొటో తీసి చూపించాడు. పిల్లల ఫొటో కూడా చూపించాడు.

"డబ్బుకి కక్కుర్తిపడి మనవరాలి గొంతు కోయమంటారా శంకరయ్య గారూ!" అంది రవణమ్మ మెత్తబడుతున్నట్టు.

పక్క గదిలో కూర్చుని పత్రిక తిరగేస్తున్న ఉషకి సవతితల్లి జ్ఞాపకం వచ్చింది. తల్లి పోయినప్పటి దుఃఖం జ్ఞాపకం వచ్చింది.

"అమ్మాయ్ ఉషా!" శంకరయ్యే పిలిచాడు. గదిలోంచి వచ్చిన ఉషకి ఫొటోలు అందించాడు. పెళ్లికొడుకు బాగున్నాడు.

అంతకంటే ఎక్కువగా ఆ చిన్నపిల్లలు ఇద్దరూ ఉష హృదయాన్ని స్పృశించారు వాళ్ల జాలి చూపుల్తో.

సవతితల్లి ఆరళ్లకి తను ఎంత బాధపడిందో... మరణించిన తన తల్లి కోసం తన మనసు ఎంత ఆరాటపడిందో ఇంకా జ్ఞాపకాలే. ఈ పసిపిల్లలిద్దర్నీ తను అయితేనే అర్థం చేసుకుని ఆదరించగలదు. వేరే ఏ స్త్రీ వాళ్లకి సవతి తల్లిగా వచ్చినా, అచ్చం తన దుస్థితే వాళ్లకి పడుతుంది.

ఉష కళ్లనిండా నీళ్లు నిండాయి. "తాతయ్యా, అమ్మమ్మా! నాకీ సంబంధం ఇష్టమే. ఖాయం చెయ్యండి. పెళ్లికి తొందరపడి నేను ఈ మాట అనటం లేదు. నాలాగే తల్లిలేని ఆ పిల్లలకి తల్లిని అవ్వాలని ఆరాటపడుతున్నాను. నేను పడ్డ మానసిక క్షోభ ఆ పిల్లలు పడకూడదన్నదే నా కోరిక. ఈ పెళ్లి ఖాయం చెయ్యండి శంకరయ్యగారూ! ఈ పెళ్లి నాకిష్టమే"

ఉష పెళ్లికొడుకు ఫొటో బల్లపై పెట్టి, పిల్లల ఫొటో పట్టుకుని తిరిగి లోపలికి వెళ్లిపోయింది.

○

## అనుభవిద్దాం

"సినిమాలు, సిగరెట్లు, జర్దాలు, జూదము లాంటి అలవాట్లెందుకురా నీకు" దండించాడు స్నేహితుడు రాజారాం.

ఇంకా పెద్దయితే సంపాదిస్తామో లేదో, నాన్న గారి హయాంలోనే అన్నీ అనుభవిద్దామని" నసిగాడు జనార్దనం.

*– కె. గురునాథ పిళ్లై*